క్లుప్తంగా

కనుల పండువగా మౌలాలిస్వామి సరిగెత్తు


పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: నారాయణాపురం గ్రామంలో మంగళవారం మౌలాలిస్వామి సరిగెత్తు కనుల పండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొలువు నాగేశ్వరరావు సహకారంతో వేడుకలు జరిపించారు. ఇందులో భాగంగా పీర్ల చావిడీని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తర్వాత మౌలాలిస్వామి పీర్లను గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని పీర్లకు సూచికాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గడ్డివాముల దగ్ధం

మహానంది: అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధమైన ఘటన మంగళవారం బొల్లవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంతా వెంకటేశ్వర్లు పశువుల కోసం నిల్వ ఉంచుకున్న గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిబూడిదయ్యాయి. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.30వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని


మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

మిడుతూరు: గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించి వలసలు నివారించాలని జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు వలసలు వెళ్లకుండా ఉపాధిహామీ సిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పనులు ప్రారంభించని గ్రామాలలో త్వరగా చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఏపీఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థాన ఉద్యోగుల అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల ఆలయం నుంచి ఇతర ఆలయాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులు డిప్యూటేషన్‌పై 5మంది ఆలయానికి రాగా వారికి విధులు కేటాయించారు. అలాగే పర్యవేక్షణ అధికారి నుంచి రికార్డు అసిస్టెంట్ స్థాయి వరకు 9 మందిని అంతర్గతగా బదిలీ చేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి వచ్చిన యం.ఫణిధరప్రసాద్ (సహాయ కార్యనిర్వహణాధికారి)కి పారిశుద్ధ్య విభాగము, క్యూ కాంప్లెక్స్, అర్జితసేవా, డోనేషన్ కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించారు. సిబ్బంది వారికి కేటాయించిన విధులలో వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. దేవస్థానంలో వివిధ విభాగముల పనితీరును మెరుగు పరచవలసిన అవశ్యకత దృష్ట్యా, పరిపాలనా సౌలభ్యం కోసం రెగ్యులర్ సిబ్బందికి అంతర్గత బదిలీలు చేశామని ఈఓ పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న రమణారెడ్డి

నంద్యాల(రూరల్): ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విద్యుత్ వార్షిక ఆదాయ అవసరాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణారెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 19, 20, 21వ తేదీల్లో నిర్వహించే బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ రిటైల్ ధరలపై అపోహలు కలిగిన వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. స్థానిక నంద్యాల విద్యుత్ జిల్లా కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. ఏడీఈలు ఆంథోనిరాజు, సతీష్‌కుమార్ రెడ్డి, సుబ్బారావు, ఏఈ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల ఆలయం.. పుష్పశోభితం


విద్యుద్దీపకాంతులతో శ్రీశైల ఆలయం

సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీశైల ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయ ధ్వజస్తంభం, ఉభయ దేవాలయాలను, కల్యాణమండపంలోని సదస్యం కార్యక్రమం నిర్వహించే మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. దీంతో శ్రీశైల ఆలయం పుష్పశోభితంగా మారింది. అలాగే ఉభయ దేవాలయాల్లో గోపురాలకు, క్షేత్రంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుదీపాలు పలువురు భక్తులను ఆకట్టుకున్నాయి. – శ్రీశైలంటెంపుల్


సుందరంగా అలంకరించిన సదస్యం నిర్వహించే మండపం

ప్రధానాలయ ధ్వజస్తంభానికి వివిధ రకాల పుష్పాలతో అలంకరణ

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న పాలన స్వర్ణయుగం
- ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


లబ్ధిదారుడికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఇంటికీ రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు, మజరా పెంచికల పల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేసి వారి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన రాష్ట్రంలో స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల బాగోగులు తెలుసుకొని ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, పింఛన్లు, పక్కా గృహాలు, విద్యుత్ సరఫరాకు స్తంభాలు వేయించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచు అఖ్తరున్నిసా, ఎంపీటీసీ బషీర్‌అహ్మద్, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌడయ్య, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, శివలింగం, పీఎంసీ చైర్మన్లు శ్రీనివాసులు, షేక్షాఅలీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి, జబ్బార్, శ్రీనివాసులు, గోవిందగౌడు, వెంకటేశ్వరరెడ్డి, రఘురామిరెడ్డి, పీరయ్య, గౌస్, భీమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శివం రోడ్డులో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేయండి


శ్రీశైల ఆలయ ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ప్రధానాలయానికి ఎదురుగా ఉన్న శివం రోడ్డులో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆలయానికి ఎదురుగా రూ.80లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. దేవస్థాన ఈఓ రహదారి నిర్మాణం గురించి మంత్రికి వివరించారు. ప్రధాన వీధులలో స్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం, రథోత్సవం, గ్రామోత్సవాలను భక్తులందరు వీక్షించేందుకు వీలుగా రహదారిపై తగు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రహదారి ఆహ్లాదకరంగా ఉండేవిధంగా ఇరువైపులా సుందరీకరణ మొక్కలతో పచ్చదనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు దర్శనాంతరం సులభంగా లలితాంబికా వాణిజ్య సముదాయానికి చేరుకునే విధంగా, బయటకు వచ్చే దారులను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

సమగ్ర సర్వేతో భూ సమస్యలకు చెక్


నందికొట్కూరు పట్టణంలో భూసర్వేను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిశోర్, సిబ్బంది

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వే పథకంతో భూసమస్యలకు చెక్ పడనుందని నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ కిశోర్ అన్నారు. మంగళవారం నందికొట్కూరు పట్టణ పరిధిలో ఏరోడైన్ ఇండియా వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ న్యూ ఢిల్లీ ఏజెన్సీ అధ్వర్యంలో సమగ్ర స్థిరాస్తుల భూసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటీష పాలనలో రూపొందించిన భూరికార్డుల వల్ల నానాటి భూసమస్యలు నెలకొనడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. భూ సమస్యలకు చెక్‌పెట్టేందుకు గాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమగ్ర భూసర్వే పథకాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఆధునిక పద్ధతిలో భూములను డిజిటల్ సర్వేచేసి పటిష్టమైన రికార్డులను తయారు చేయనున్నట్లు వివరించారు. తద్వారా ఎన్నటికీ ప్రజలు, రైతుల మధ్య భూసమస్యలు తలెత్తవని తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి బాలమద్దయ్య, సూపర్‌వైజర్ శివుడునాయక్, వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు ప్రవీణ్, హుసేన్, నరేష్, శ్రీనాథ్, రమేష్, సుదర్శన్, కిరణ్మయి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి



భక్తి కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన టి.నారాయణ బృందం వారి గాత్రకచేరి పలువురు భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణపతిస్తుతి, భో..శంభో, శంభోశంకర, యోగేశ్వరాయ తదితర కీర్తనలను టి.నారాయణ, ఎం.రాము భాగవతార్, టి.మాణిక్యం, ఎం.బాలస్వామి, గోవర్ధన్, బి.మద్దిలేటి, ఆర్.మధుకుమార్ ఆలపించారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


క్రికెట్ విజేత కొత్తపల్లి టీమ్‌కు బహుమతి అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకున్నవారే ఉత్తమ క్రీడాకారులు అని వెలుగోడు సర్పంచు వేల్పుల జయపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తాండవమల్లేశ్వస్వామి తిరునాల సందర్భంగా కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి విజేత కొత్తపల్లి రజిని టీమ్‌కు రూ.20,016, రెండో బహుమతి ముసలిమడుగు జట్టుకు రూ.10,016 అందజేశారు. కార్యక్రమంలో వెలుగోడు వైస్ ఎంపీపీ నజీరుద్దీన్, ఎంపీటీసీ ఎం.రాజేష్, సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ మల్లయ్య, నిర్వాహకులు అశోక్, రవి, రాజ్‌కుమార్ ఉన్నారు.

కబడ్డీ విజేత ఆత్మకూరు హనుమాన్ జట్టు

స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో సాయిజట్టు ఆత్మకూరుపై హనుమాన్ జట్టు ఆత్మకూరు విజయం సాధించింది. మొదటి విజేతలకు రూ.10వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి దామగట్ల జట్టు రూ.5వేలు, నాల్గో బహుమతి మస్తాన్ కొత్తపల్లి జట్టు రూ. 4వేలు, ఐదో బహుమతి వేల్పనూరు జట్టు రూ.3వేలు, ఆరో బహుమతి ఎస్‌జేపీ జట్టు రూ.2వేలను కైవసం చేసుకున్నాయి. వీరికి ఏఎస్‌ఐ రామ్‌నాథ్, గ్రామస్తులు శేఖర్ గౌడ్, మోహన్‌యాదవ్, బ్రహ్మానందరెడ్డి, ఆర్గనైజర్లు మస్తాన్, శివ, ప్రవీణలు బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్రంలో గిరిజన సంక్షేమం భేష్

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్


శంకర్ నాయక్‌ను కలిసిన గిరిజన సంఘాల నాయకులు

వెలుగోడు: రాష్ట ప్రభుత్వం గిరిజనుల కోసం, ప్రత్యేకంగా బలహీన సమూహాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ కితాబిచ్చారు. నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం వెలుగోడు పట్టణానికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ప్రత్యేకంగా వైద్య, విద్య, రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యుడిని గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు రాజు నాయక్, రవి నాయక్, బాలు నాయక్, మల్లేష్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాము నాయక్, వైఎస్సార్‌సీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, టౌన్ ప్రధాన కార్యదర్శి నీలా నాయక్, నాయకులు నాగేష్ నాయక్, సురేష్ నాయక్, అశోక్ నాయక్, టీచర్ నాగ స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించినా.. ప్రారంభం కాని పనులు


కార్యాలయంలో శిథిలమైన పిల్లర్


పీఆర్ ఏఈఈ గదిలో పెచ్చులూడిన పైకప్పు

జూపాడుబంగ్లా: ఎంపీడీఓ కార్యాలయ మరమ్మతులకు నిధులు కేటాయించి ఏడాది గడిచినా నేటికీ పనులు ప్రారంభించకపోవటంతో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏడాది క్రితం మండల పరిషత్ నిధుల్లోంచి రూ.6లక్షలను ఎంపీడీఓ కార్యాలయ మరమ్మతులకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. నిధులను వెచ్చించి ఎంపీడీఓ కార్యాలయంలో శిథిలమైన భవనాల పైకప్పుకు, పిల్లర్లకు, బాత్‌రూంలకు రిపేర్లు చేయాలని నిశ్చయించారు. అయితే ఇప్పటిదాకా పనులు చేపట్టకపోవటంతో ఎప్పుడు నెత్తిన పెంకులు కూలి నెత్తినపడ్తాయోననే భయంతో కార్యాలయ సిబ్బంది భయం భయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయంలో సభలు, సమావేశాలు నిర్వహించిన సమయంలో సమావేశానికి హాజరైన మహిళా ఉద్యోగులు అత్యవసరాలకు వెళ్లేందుకు సరైన వసతిలేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై మూడు మాసాల క్రితం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈఓపీఆర్డీ ప్రస్తావించటంతో పాటు వెంటనే కేటాయించిన నిధులు వెచ్చించి ఎంపీడీఓ కార్యాలయంలో మరమ్మతు పనులు చేపట్టాలని సభ్యులను కోరారు. అయినా ఇప్పటిదాకా పనులు ప్రారంభించలేదు. అధికారులు చర్యలు తీసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో మరమ్మతు పనులు చేపట్టాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

20 వరకు బియ్యం పంపిణీ

నంద్యాల(అర్బన్): ఎండీయూ వాహనాల ద్వారా ఈనెల 20వ తేదీ వరకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆచార్యులు తెలిపారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు శాప్ ఫుట్‌బాల్ లీగ్ ప్రారంభం

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో ఈ నెల 18న శాప్ ఫుట్‌బాల్ లీగ్ రాష్ట్రస్థాయి ఫేజ్–2 పోటీలు ప్రారంభం కానున్నాయని క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు తెలిపారు. బుధ, గురువారాల్లో పురుషుల లీగ్ పోటీలు జరుగుతాయన్నారు.

ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు


సిద్ధేశ్వరం ఘాట్‌ను సందర్శిస్తున్న సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం

కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్రంలోని సింగోటంలో జాతర ముగిసే వరకూ కృష్ణానది తీరంలో ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సీఐ ఆర్‌జీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని సంగమేశ్వరం, సిద్దేశ్వరం, జానాలగూడెం ఘాట్లను మంగళవారం తన సిబ్బందితో కలసి సందర్శించారు. జాతరకు ఎవరైనా మరబోట్లు తిప్పుతున్నారా అని బందోబస్తు పెట్టిన పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సింగోటం జాతరకు కృష్ణానదిపై మరబోటు, తెప్పలపై ప్రయాణాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిషేధించామన్నారు. జాతరకు వెళ్లదలచిన భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో వారు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఉల్లంఘించి బోట్లు, తెప్పలను నడిపిన వారిపైన, అందులో ప్రయాణం చేసిన ప్రయాణికులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్‌ఐ రామ్‌నాథ్, వీఆర్వోలు అశోక్, రామసుబ్బలు ఉన్నారు.

లక్షల్లో ఆదాయం.. అయినా నిర్లక్ష్యం!

- ధూప, దీప నైవేద్యాలకు నోచుకోని లింగమయ్య స్వామి
- ఆలయానికి 6 ఎకరాల మాన్యం
- వేలం ద్వారా ఏటా రూ.2 లక్షల ఆదాయం


లింగమయ్యస్వామి ఆలయం

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామ సమీపంలో ఉన్న లింగమయ్యస్వామి ధూప, దీప నైవేద్యాలకు నోచుకోకపోవటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ కాల్వ గట్టున ఉన్న స్వామివారికి ఎనిమిది ఎకరాల మాన్యం భూములన్నాయి. వీటికి ఏటా వేలాలు నిర్వహించటం ద్వారా సుమారు రూ. 2లక్షల ఆదాయం సమకూరుతుంది. వీటిని వినియోగించి స్వామివారికి గుడిని నిర్మించాల్సిన దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవటంతో స్వామివారు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాడు. స్వామివారి చుట్టూ కేవలం గోడను కట్టి దేవదాయశాఖ అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో కోతులు, కుక్కలు, లోపలికి వెళ్లి స్వామి వారి ప్రతిమను అపరిశుభ్రం చేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని స్వామివారి మాన్యం భూముల వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని వెచ్చించి స్వామివారికి చిన్నపాటి గుడిని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వసంతోత్సవంతో ముగిసిన తిరునాల


తూర్పు ప్రాతకోటలో పల్లకోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

పగిడ్యాల: సంక్రాంతి పర్వదినాన్ని పురుస్కరించుకుని ఈనెల 13వ తేదీ నుంచి తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో కొనసాగుతున్న నాగేశ్వర స్వామి, కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు వసంతోత్సవంతో ముగిశాయి. మంగళవారం పార్వేట పద్యములు చదివిన అనంతరం గ్రామంలో ఉత్సవ మూర్తులను ఊరేగింపు చేపట్టి వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం దేవతా మూర్తుల ప్రతిమలకు కోనేటిలో స్నానం చేయించి పల్లకీ సేవలను నిర్వహించి వేడుకలను ముగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక అధికారి గుర్రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ నాయుడు, అంబటి శివశంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవం

కొత్తపల్లి: పార్వతీసమేత తాండవమల్లేశ్వరస్వామి తిరునాలలో భాగంగా మంగళవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంతో స్వామివారి తిరునాల ముగిసింది. పుష్యశుద్ధ దశమిరోజు ఉదయం స్వామి అమ్మవార్లకు బిందెసేవ, అభిసేకం, కుంకుమార్చన వంటి విశేషపూజలు ఆలయ పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ, మల్లికారుజన ఆచారిలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నందివాహనంపై ఆశీనులు గావించి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ పొలిమేర వరకు పార్వేట నిర్వహించారు. అక్కడ పార్వేట గొర్రెకు తోక కోసి వదిలారు. దానిని యువకులు వెంబడించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన బొర్రబోయిన సుధీర్ యాదవ్ అనే యువకుడు పార్వేట గొర్రెను పట్టుకొని విజేతగా నిలిచాడు.యువకుడిని గ్రామస్తులు పూలమాలతో సత్కరించారు.


కొత్తపల్లిలో పార్వేట ఉత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

ప్రకృతి గీసిన చిత్రం



అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారుడు ఉండడు. సూర్యోదయం, సాయం సంధ్య వేళలో అరుణుడు అద్దే వర్ణాలకు ప్రకృతి ప్రేమికులు ఫిదా అవ్వాల్సిందే. లేలేత ఎరుపు, బంగారు, అరుణవర్ణాల ఆకాశం, పుడమితల్లి, మోడు వృక్షం అన్నీ కలిసి ఓ చిత్రకారుడు గీసిన చిత్రంలా కనిపించిన ఈ దృశ్యం మంగళవారం సాయంత్రం తమ్మడపల్లె సమీపంలో కనిపించింది.

– మహానంది